# బా బు



నాలుగు రాస్తాలూ దాటి ఆటపాకాయలసంచితో ఆదరాబాదరాగా బయలు దేరాడు చలం. బజారు మెయిన్‌రోడ్డు మీదుగా ఉడిపి హోటలుదాటి నిర్మానుష్యంగా ఉన్న ఆ వీధిలోకి వచ్చేవరకూ ఆయనీలోకంలోనే లేడు. రోడ్డుమీద నడుస్తున్నా అతని మనస్సులో బాబే మెదులుతున్నాడు. ఏవో కల్పనల్ని సృష్టించుకొని ఆకల్పనలకు బాబుని కథావస్తువును చేసి తనలో తనే నవ్వుకొంటూ నడిచిపోతున్నాడు.

'తను వెళ్ళేటప్పటికి బాబు ఆడుకొంటూ ఉంటాడు. తనను బాబు అదోలా చూస్తుంటే తను టపాకాయల్ని బాబుచేతిలో పెట్టేస్తాడు. బాబు వాటితో పరుగెత్తివెళ్ళి అమ్మఒళ్ళో దూర్తాడు. ఆ రాత్రే బాబు మతాబుల్ని వెలిగించి ఆనందంతో కేరింతాలు కొడుతూ ఆడుతూంటే తను సందు మొదల్లో ఓచోటనుంచొని ఓమారు బాబుని చూస్తాడు. చిరునవ్వుతో బాబుకనిపిస్తే తనివార బాబునిచూస్తూ ఉండిపోతాడు. అలా చూస్తే తనకో ఆనందం. అదే తన జీవితంలో గాలికి వీడిపోయిన స్నేహాలతల్ని పెనవేసి ముడివేస్తుంది. జీవితంలో ఆనందంగా గడిచిపోయిన అనుభూతుల్ని కళ్ళముందు పెడుతుంది.'

మనస్సులో ఏవేవో విషయాల్ని ఆలోచించుకొంటూ సందుమలుపు దగ్గరకు వచ్చి టక్కున ఆగిపోయాడు చలం. ఆగిపోయినవాడల్లా ఓమారు సంచిలోని సామానులకేసిచూసి మళ్ళా గబగబా అంగలువేసుకొంటూ మేడదగ్గరకు చేరుకున్నాడు. లోపలికి వెళ్ళనా వద్దన్న ఆలోచనతోనే గేటు తెరచి లోనికివెళ్ళి అరుగుమీద చతికిలపడ్డాడు. మేడకింద

తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయము

భాగం తాళంవేసిఉంది. అసలు అతనికిఉన్న పసంతా ఆ మేడపై భాగంలో ఉంటున్నవాళ్ళతోనే.

అరుగుమీద చతికిలబడ్డ చలం లేచినుంచోని మళ్ళీ అక్కడే కూర్చుండిపోయాడు. లోపలికి వెళ్ళేధైర్యం అతనికిలేదు. ప్రయత్నించినా కాళ్ళుముందుకు వెళ్ళడంలేదు. 'ఆమె తన్ను చూసి ఏమనుకుంటుందో' అన్న ఆలోచన హృదయం లోకి రాగానే ఉన్న ఆ కొద్దిధైర్యం కరిగి నీరై పోతోంది.

చాలా సేపటివరకూ క్రిందనే కూర్చున్నాడు. ఒకటి రెండు సార్లు మెట్లదగ్గరవరకూ వచ్చి "బాబూ" అని పిలిచాడు. లోపలినుండి జవాబేమీ రాలేదు. మళ్ళీ వెనక్కు తిరిగివచ్చి అక్కడే కూర్చున్నాడు.

'చీకటి పడుతోంది. ఇంకొంచంసేపుంటే దీపావళి ప్రారంభిస్తారు. వేగంగా ఈటపాకాయల్ని బాబుకు యిచ్చెయ్యాలి. అవతల యింటిదగ్గర లక్ష్మీ, గోపీ ఎదురుచూస్తూంటారు. పిల్లకాయలు వస్తున్నప్పుడే చెప్పారు వేగిరంగా మతాబాలు తీసుకురమ్మని.'

ఆ ఉద్దేశంతోనే లోపల భయంగా ఉన్నా లేచి నుంచున్నాడు. సంచిలోని టపాకాయలకట్ట, దానితోపాటు రెండు కాకరపూఒత్తుల పెట్టెలు. యింకొన్ని మతాబీలు, వేరేగా తీసి చేత్తో పట్టుకొని అడుగుల్లో అడుగులు వేసుకొంటూ మేడమెట్లు ఎక్కాడు.

ఎదురుగుండా బాబు ఆడుకుంటున్నాడు. అతని ముందు దీపావళీసామానంతా పెద్దమేటతో ఉంది. ఎన్నోరకాల విలు

వైన సామానంఅంతా అతనిముందు ఉంది. బాబు వాటితో ఆడుకుంటుంటే పనిమనిషి ప్రక్కన కూర్చొని ఉంది. బాబు యిష్టంఉన్న వస్తువులు తీసి వెలిగించమని పనిమనిషికి యిస్తున్నాడు. మరికొన్ని అవతలకు గిరాటు వేస్తున్నాడు. ఎదురుగుండా ఉన్న మతాబులు యిన్ని తీసి పనిమనిషిచేతిలో పెట్టాడు తీసుకోమన్న ధోరణిలో. అదిచూసి సిగ్గుపడిపోయాడు చలం.

'ఏమిటి! బాబు పనిమనిషి కిచ్చినన్నైనా లేవు తను తీసుకు వెళ్ళినసామాను. ఏ మొఖంతో వాటిని బాబుకు ప్రజెంటు చేసేది? తనలాంటి నికృష్ట జీవితానికి యింతకన్న అధికం యిచ్చే యోగ్యత లేదు. ఆఖరికి పండుగనాడు కూడా బాబు చేతుల్లో మనసార ఈ వస్తువుల్ని పెట్టలేకపోతున్నాను' అనుకున్నాడు చలం.

తిరిగి తనను తనే సమర్థించుకున్నాడు 'బాబు ఎందుకు తీసుకోడు? బాబుదగ్గర టపాకాయలు లేవుగా. అంతకన్నా అధికమైనవి ఉంటేనేమాత్రం; పోనీ అవైనా తీసుకుంటాడు'

ఆలోచనతోపాటు ముఖంలో చిన్నగా ఆనందంమెరిసింది. సంతోషంతో "బాబూ" అని పిలిచాడు. బాబు చలంకేసి అదోలా చూశాడు. తన్ను చూసి నవ్వుతున్న ఈ క్రొత్త మనిషి ఎవరా అన్నట్టు ఆశ్చర్యంతో చలాన్ని నిదానించి చూసి "అమ్మా" అన్నాడు గట్టిగా.

చలానికి ముచ్చెమటలు పోసినయ్ 'ఆమె వస్తుందిగాబోలు. వస్తే...ఆమె ఏమనుకుంటుందో, తననుచూస్తే ఆమె అనుమానిస్తుంది. ఇంతకాలంగా ఆమె తనను అపార్థంచేసుకొం

టూవస్తున్నప్పుడు ఇప్పుడివియిస్తే ఎందుకు పుచ్చుకొంటుంది? బాబు కని తెచ్చిన వీటిని తిరగ్గొట్టేస్తే...' చలం కంగారుగా సామానుల్ని గట్టుమీద పెట్టి గబగబా మెట్లు దిగబోయాడు.

ఆమె నస్తూనే "ఎవరండీ" అంది మెట్లుదిగుతూన్న చలాన్ని చూసి. చలం గడగడా వణికిపోతూ వెనక్కి తిరిగాడు. తడబడుతూన్న మాటలతో "బాబుకని.....ఇవి......ఇవి తెచ్చాను." అన్నాడు.

అతని మాటలు ఆమె వినేస్థితిలో లేదు. అతన్ని చూడ్డంతోనే ఆమె ముఖం ఎర్రబడిపోయింది. పెదాలు వణికాయి. అసహ్యంగా అతనివేపు చూసింది. చలం అక్కడ ఉంచిన సామానుల్ని క్రిందకుతోసేస్తూ "అక్కర్లేదు. ఇవి మీరే తీసుకువెళ్ళండి. మళ్ళీ ఎప్పుడూ ఇలా వచ్చేరంటే......" మధ్యలో ఆమె ఆపేసి బాబును తీసుకొని చరచరా లోపలికి వెళ్ళిపోయింది.

చలం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇంతగా తన్ని ఎందుకు ఆమె అపార్థం చేసుకొంటోందో అర్థంగాక, అనుకున్నంత పనీ అయ్యాక క్రిందపడి నగంపెరిగిపోయిన ఆ వస్తువుల్ని చూసుకొని మెల్లిగా అక్కడనుండి వెళ్ళిపోయాడు. వెళ్ళి సందు మొదట్లో లాంతరు స్థంభానికి ఆనుకుని నుంచున్నాడు.

బాబుచేత ఆమె మతాబీలు కాల్పిస్తుంటే అక్కడనుండి కళ్ళార్పకుండా అతనినేచూస్తూ ఉండిపోయాడు చలం.

'ఆసూదిముక్కూ, నొక్కులజుట్టూ, కోలముఖం...అంతా వాళ్ళ నాన్న పోలికే! నిజంగా శ్రీహరే ఉంటే ఆకొడుకుని

చూసి ఎంతగా సంతోషించేవాడో ! కాని అతనికా భాగ్యం లేదు. కొడుక్కి కబుర్లుచెప్పి, కథలుచెప్పి లాలించి ఆడించే అదృష్టంలేదు. ఏడాది కొడుకైనా నా చూడకుండా ‘ఇంకే నీకూ నాకూ సంబంధం’ అన్నట్టుగా ఈలోకంలోనుండి వెళ్ళిపోయాడు. మళ్ళీ అలాంటి స్నేహితుడు దొరికే అదృష్టం తనకిక లేదు...... ...’

చలం చెక్కిళ్ళమీద కన్నీరు చారికలు కట్టింది. ఓమారు రుమాలుతో కన్నీరు వత్తుకొని అక్కడనుండి యింటికి బయలుదేరాడు. దారిలో వీధిపొడుగునా దీపాలతో అలంకరిస్తుంటే, రకరకాల మందుగుండు అంతా కాలుస్తూఉంటే వాటితో సంబంధం లేకుండా ఆలోచిస్తూ నడుస్తున్నాడు. అతని స్మృతిపథంలో అయిదేళ్ళనాటి జీవితం అంతా కళ్ళకు కట్టినట్లు కనపడింది. గతంలోని సంఘటనలు నెమరువేసుకొంటున్నాడు చలం.

అయిదేళ్ళ క్రిందట మొదటి సారిగా శ్రీహరితో పరిచయం అయ్యింది. కాలేజీలో చదువుకొనే రోజుల్లో కావాలని చలంతో పరిచయం చేసుకున్నాడు శ్రీహరి. చలం ప్రవర్తన చూశాక అతని స్నేహం కావాలని కోరాడు. ‘ఊ’ అన్నాడు చలం. అదే వాళ్ళ స్నేహానికి నాంది. అనాటినుండీ ఆ కాలేజీలో చదువుకున్న అయిదు సంవత్సరాలూ కలిసికట్టుగా ఉండేవారు. ఆత్మీయుల్లా, ప్రాణస్నేహితుల్లా మెలిగారు. ఆర్థికంగా చలానికి సహాయం చేసేవాడు శ్రీహరి.

కళాశాలలోంచి బయటికివచ్చాక తాత్కాలికంగా విడిపోవలసివచ్చింది. చలంచదువుకు అంతటితో స్వస్తి చెప్పి గుమస్తా

గిరిలో చేరాడు. శ్రీహరి మరో నాలుగేళ్ళు 'లా' చదివి వచ్చాడు. ఈ నాలుగేళ్ళకాలంలోనూ ఉత్తరాలే వాళ్ళ స్నేహాన్ని నిలబెట్టుతూ వచ్చాయి. చలంపెళ్ళికి పరీక్షలు మూలంగా శ్రీహరి వెళ్ళలేదు. ఊరినుండి రావడంతోటే అక్కడే ప్రాక్టీసు పెట్టాడు. ఆతర్వాత వివాహంకూడా జరిగింది.

మళ్ళీ యింతకాలంతర్వాత యిరువురు మిత్రులు ఒకచోటికి చేరుకున్నారు. ఇప్పుడు యిరువురిమధ్య ఉంటున్న మిత్రత్వానికి ఒకనాటి వాళ్ళస్నేహానికి చాలా తేడావుంది. ఇరువురూ బాధ్యతాయుతమైన జీవితాల్ని మోస్తున్నారు. ఇరువురి లోనూ గౌరవం, హోదా, అధికారం పెరిగాయి. కాలేజీ రోజుల్లో అల్లరిచిల్లరిగా చేయిచేయి పట్టుకు తిరిగే స్నేహం కాదది. పెద్దలుగా సంసారాలు సాగిస్తూ బుద్ధిమంతులుగా ఉంటూన్న సమయమిది. హోదాలతోపాటు వాళ్ళస్నేహం కూడా ఓ విశిష్టస్థానాన్ని చేరుకుంది.

"చూడు చలం. నువ్వేమో యీ గుమస్తాగిరినుండి కదల నంటున్నావు. ఇందులో ఒచ్చేదేమైనా ఉందాలంటే అదీలేదు. ఇలా ఎంతకాలం గెంజిమెతుకుల్తో బాధపడతావు? మరో రెండేళ్ళు చదివి B. A. అయిందనిపించెయ్యి. కావాలంటే కబ్బు సర్దుబాటు నేనుచేస్తాను." అన్నాడు శ్రీహరి. ఆర్థి కంగా బాధపడుతూన్నచలం బాగుపడాలంటే ఇదొక్కటే తనుచెయ్యగలిగిన సహాయం అనుకున్నాడు శ్రీహరి. అమాం తంగా మిత్రుడ్ని కౌగలించుకున్నాడుచలం. అతనికళ్ళల్లో నుండి కృతజ్ఞతాపూర్వకంగా రెండు బిందువులు మిత్రుడి భుజం మీద పడ్డాయి.

" శ్రీహరి నీలాంటివాడితో స్నేహంచెయ్యడం నాఅదృష్టం మాటవరసకు అలా అనేవాళ్ళైనా లేని ఈరోజుల్లో నువ్వు ఇంత సహాయం చెయ్యదల్చుకున్నందుకు చాలా సంతోషం. ఇప్పటికే నాగురించి నువ్వు ఎంతో డబ్బు ఖర్చుపెట్టావు. నీకింక శ్రమ కలిగించదలచుకోలేదు. నీలాంటిమిత్రుడ్ని విడిచి దూరం దూరంగా ఉండలేనుకూడా. ఏదో యిలాగే కాలంవెళ్ళిపోనీ."

చలంఅన్న మాటలకు శ్రీహరి అభ్యంతరమేమీ చెప్పలేదు. హృదయంలోనే "ఎంత అమాయకుడు" అనుకొంటూ ఒక్కసారి గట్టిగా నిట్టూర్పు విడిచిపెట్టాడు.

అతనే ప్రయత్నించి ఆతర్వాత 100 రూ॥ జీతంతో చలానికి ఓ ఉద్యోగం చూసిపెట్టాడు. చలం భార్య పురిటినాడు చేతిలో చిల్లిగవ్వయినా లేనప్పుడు రెండువందల రూపాయలు ఇచ్చాడు శ్రీహరి. అవి తిరిగి అతను యిచ్చెయ్యాలని ఎప్పుడూ కోరలేదు. గట్టిగా చలం ఈడబ్బువిషయంలో తిరిగి యిచ్చెయ్యాలని ప్రయత్నించినా ఇవ్వలేకపోయాడు.

అంత దగ్గరగా, అప్తులుగా, సహచరులుగా వాళ్లు మెలిగే వారు. సాయంకాలంకాగానే ఆఫీసునుండి చలం తిన్నగా మ్యునిసిపల్ పార్కుదగ్గరకు చేరుకుంటాడు. మరికొంచెం సేపటికి శ్రీహరికూడా అక్కడకువస్తాడు. ఇరువురూ గోదావరి గట్టువెంబడే నడుచుకుపోయేవారు. వాళ్ళదైనందినకార్యంలో అలా షికారుకువెళ్ళడం కూడా ఒకటిగా నిర్ణయమైపోయింది.

రెండేళ్ళు యిలా జరిగాక శ్రీహరికి జబ్బుచేసింది. అదే అతని ప్రాణాన్ని తీసింది. ఇప్పుడు చలం ఒంటరివాడయ్యాడు.

"చూడు చలం! నేను ఒకవేళ చనిపోతే మనమిత్రత్వం మర్చి పోవు కదూ?" అన్నాడు శ్రీహరి ఓనాడు. ఆ వేమాటలు లక్షసార్లు చలం గుండెల్లో వినిపించాయి.

ఈ ఒక్క సంవత్సరం ఎలా గడిచిపోయిందో చలానికి కూడా అర్థం కాలేదు. శ్రీహరి పోయి రెండో ఏడు కావస్తూ ఉంది. క్రమంగా శ్రీహరి చలంమనస్సులో మిత్రుడుగా నిలిచి పోయాడు. అతనిని గురించిన విషయాలన్నీ క్రమంగా చలంలో మరుగుపడిపోయాయి. ఇంత వేగంగా శ్రీహరిని ఎలా మర్చిపోయాడో చలం ఆలోచించి ఉంటే తాను మిత్రుడికి చాలాఅన్యాయం చేస్తున్నానని తెలుసుకొనేవాడు.

ఇప్పుడు చలం యిద్దరిపిల్లల తండ్రికావడం, సంసారంలో చాలీచాలని జీతంతో నానా యాతనపడుతూంటే పూర్తిగా మిత్రుడ్ని మర్చిపోయాడు.

ఒకరోజు పనిమీద స్టేషనుకు వెళ్ళవస్తూ ఆవీధి మొదట్లో ఎలక్ట్రిక్ స్తంభం క్రింద సిటీబస్సు గురించి ఎదురు చూస్తూ నుంచున్నాడు. మళ్ళీ అతని మనస్సులో ఓమూల ఆవీధి, వీధిమధ్యలో మేడ...అందులో శ్రీహరి — అంతా మెదిలారు. క్షణంసేపు ఆలోచన అతనిలో ఉండి సిలి తెరలా జారుకుపోయింది.

సిగరెట్టు వెలిగించి బస్సుగురించి చూస్తూ ఉన్నాడు. పైనుండి తెగిపోయిన గాలిపటం ఒకటి ఎగిరివచ్చి అతని కాళ్ళముందు పడింది. దానివెనుక నేపదేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొచ్చి గాలిపటం పుచ్చుకొని వెళ్ళిపోయాడు. అతని చంకలో రెండేళ్ళకుర్రాడు తప్పట్లు చరుస్తూ పిచ్చిగా అల్లరి చేస్తున్నాడు.

చలం మనస్సులో చిన్న సంచలనం రేగింది. "ఎవరూ... అవును... అతనే... శ్రీహరికొడుకు... అంతా అతనిపోలికే... అదిగో! అదే ఇంట్లోకి వెళ్ళుతున్నాడు."

"బాబూ" చలం ఓపికున్నంత గట్టిగా పిలిచాడు. విని పించుకోనట్టుగా వెళ్ళిపోతూంది ఆ అబ్బాయి.

'నిజంగా శ్రీహరి పోలికే. ఆ పిల్లాణ్ణి చూస్తూంటే శ్రీహరే జ్ఞాపకంవస్తున్నాడు. నిజంగా అలాంటి స్నేహితుడు ఏడీ... ఎప్పుడో తను మర్చిపోయాడు. తను తీరని అన్యాయం చేశాడు. మిత్రుడు ఆఖరిసారిగా తన్ను కోరిన కోర్కె తను నెరవేర్చిందేదీ? తను మిత్రద్రోహి. ఇంతవేగంగా ప్రాణంతో సమానమైన స్నేహితుణ్ణి మర్చిపోయిన తనలాంటివాళ్ళెవరూ లోకంలో ఉండరు. తనజీవితానికి మార్గదర్శి. అతడిని ఆజన్మాంతమూ తలపోస్తూనే ఉండాలి.' చలం ఆలోచిస్తూ యింటిముందుకు చేరుకున్నాడు. బాబుని చూడాలని ఆశ. కాని లోపలికి వెళ్ళడం ఎలా? ఆమెతో ఎప్పుడూ మాట్లాడ లేదు. అప్పట్లో చూడ్డం తప్ప మళ్ళీ ఆమెను ఈమధ్య చూడ లేదు. 'ఇప్పుడు ఇన్నేళ్ళు గడిచినతర్వాత వెళ్తే ఆమె ఏమను కుంటుందో.'

చలం వచ్చినవాడల్లా వచ్చినట్టే వెనక్కి వెళ్ళిపోయాడు. అదే లాంతరుస్తంభంక్రింద నుంచొని మేడమీదకు చూశాడు. ఆమె మేడమీద బాబుని ఎత్తుకొని గాలిపటం ఎగురవేస్తూ బాబుని ఆడిస్తూ ఉంది. ప్రక్కన పనికుర్రాడు నిలబడి చూస్తు న్నాడు. ఆమె ఆడిస్తూ తనకేసి దీక్షగా చూస్తున్న చలాన్ని

చూసింది. చటుక్కున బాబునితీసుకొని లోపలికి వెళ్ళిపోయింది. చలం అలానే నిలబడ్డాడు. మళ్ళీ ఆమె బైటకు రానేలేదు.

ఆ మరుచటిరోజు ఆఫీసునుండి బయలుదేరి ఆవీధిలోకి చేరుకున్నాడు. వస్తూ రెండు జేబుల్లోనూ రెండు మిఠాయిపొట్లాలు యిరికించుకున్నాడు. బాబు వీధిలోకివస్తే బాబు చేతుల్లో అవి పెడదామని ఎదురుచూస్తూ నుంచున్నాడు. అలాపోతుండే జనం అనుమానంగా అతనివేపు చూస్తూ ముఖం చిట్లించి మరీ వెళ్తున్నారు. చలం యిదేమీ గమనించలేదు. బాబు ఎప్పుడు కనిపిస్తాడా అనే ఆశతో మాటిమాటికి మేడమీదకు, క్రిందకూ చూస్తూ నుంచున్నాడు. చీకటిపడినా బాబు కనిపించలేదు. ఆ యింట్లో సాయంకాలపు దీపాల్ని వెలిగిస్తూ కూనిరాగాలు తీస్తున్న పనిమనిషి తప్ప ఎవరూ కనిపించలేదు. నిస్పృహగా వెనక్కుతిరిగాడు చలం. కాళ్ళీడ్చుకొంటూ సందు మలుపుతిరిగి వస్తూంటే ఆమె కనుపించింది. ఆవెనుక బుల్లిబుల్లి అడుగులు వేస్తుంటే బాబుని నడిపించుకొని పనికుర్రాడు వస్తున్నాడు.

చలం గబగబా అక్కడకు వెళ్ళాడు. "ఇందబాబూ" అంటూ జేబులోని రెండుపొట్లాలూతీసి బాబుచేతుల్లోపెట్టాడు. ఆమె వెనక్కు తిరిగి ఆశ్చర్యపోయి "ఇలా రారా సూరీ" అంది ఖటువుగా. కిక్కురుమనకుండా ఆపొట్లాలను చలంచేతుల్లో పెట్టి బాబుని ఎత్తుకొని పనికుర్రాడు వెళ్ళిపోయాడు.

దీనంగా వెళ్ళిపోతున్న బాబువంక చూశాడు చలం. బాబు మాటిమాటికి వెనక్కుతిరిగి చూస్తుంటే, ఆ బాబు

కళ్ళల్లోంచి కన్నీరు ముత్యాలుగా రాలిపోతుంటే తన వస్తువు నేదో దొంగిలించిపోతున్నట్టుగా బాధపడ్డాడు. వాళ్ళు సందుదాటి వెళ్ళేవరకూ చూస్తూ అలానే నిలబడిపోయాడు.

'వాళ్ళ హృదయాల్లో వాత్సల్యం లేదు. కారుణ్యమనేది వాళ్ళల్లో గడ్డకట్టిపోయింది. పసిపాపల మెత్తనిహృదయాల మీద ములుకులతో గాయాల్ని చేసే మనుషులు వీళ్ళు ...' చలం నోట్లోగొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

రోజూ చలం ఆఫీసునుండి వచ్చేటప్పుడు ఆ వీధిగుండావచ్చే వాడు. సరిగ్గా ఆ లాంతరుస్థంభంక్రింద నుంచొని కొంచెంసేపు మేడమీదకు చూసేవాడు. ఆమె ఆ సమయంలో బాబుని ఎత్తుకొని ఆడించేది. తన్నుఎవరో నిదానించి చూస్తున్నారని తెలియడంతోనే బాబునితీసుకొని చటుక్కున లోపలికి వెళ్ళి పోయేది.

చలానికి యిది తీరని నిరాశగాఉండేది. ఆమె అలా తనను అనుమానిస్తున్నందుకు చాలా బాధపడ్డాడు. బాబును చూడందే ఉండేవాడుకాదు. ఒకరోజు బాబు కనిపించకపోతే అదోలా అనిపించేది. నిజంగా చనిపోయిన మిత్రుడ్ని చూస్తు న్నాననే సంబరపడేవాడు. తనరెండేళ్ళకొడుకు 'గోపి' వచ్చీ రాని మాటల్తో తడబడే అడుగుల్తో అతనిముందు అల్లరి చేస్తున్నప్పుడైనా అంతటి ఆనందం పొందేవాడుగాదు అతను.

గోపీని బజారుకు తీసుకువెళ్ళి పండక్కని బట్టలుతీసి ఆ వీధి లోంచి వస్తున్నాడు చలం. మేడముందునుండి వస్తూంటే బాబు అరుగుమీద ఆడుకొంటూ కనిపించాడు. బాబుచుట్టూ

ఎవ్వరూ లేరు. పనికుర్రాడు ఆ అరుగుమీద ఓమూలకూర్చుని సినిమాకరపత్రంలో బొమ్మల్ని చూస్తున్నాడు. చలం ఎత్తుకున్న గోపీని అక్కడేదించి పరుగెత్తుకెళ్ళి బాబుని ఒక్కసారి హృదయానికి హత్తుకుని జేబులో ఓరూపాయినోటు పెట్టి వెనక్కువచ్చేవాడు. అతను రోడ్డుమీదకు వచ్చేటప్పటికి గోపి అక్కడ లేడు. రోడ్డుమధ్య మరికొంతదూరంలో జనం గుంపుగా ఉన్నారు.

చలం అక్కడకు చేరేటప్పటికి అతని కళ్ళు చెమ్మగిల్లాయి. వాళ్ళందరిమధ్యా గోపి స్పృహలేనివాడిగా పడిఉండడం చూసేసరికి అతనిగుండెలు తరుక్కుపోయాయి. 'గోపీ' అంటూ పిచ్చిగా అరిచి ఒళ్ళోకి తీసుకున్నాడు. "పిల్లాడిని అలా ఒక్కడ్నే వీధిలో ఒదిలిపెట్టావేమయ్యా. ఇంకానయం పెద్ద దెబ్బేమీ తగల్లేదు." అంటూ చుట్టూ జేరిన జనం అంటుంటే అప్పుడే తెలివివచ్చిన గోపీని ఎత్తుకొని మెల్లగా అడుగులువేసుకొంటూ అక్కడనుండి వెళ్ళిపోయాడు. రెండు రోజులవరకూ మళ్ళీ అటువైపు వెళ్ళనేలేదు.

ఆనాడు దీపావళి అని టపాకాయలవి తీసుకురమ్మని లక్ష్మీ, గోపీ అడిగినప్పుడు చటుక్కున బాబు జ్ఞాపకంవచ్చాడు. కొన్న సామానుల్లో సగం బాబుకు కేటాయించి, బాబు యింటికి వెళ్ళాడు. కాని ఆమె అతడిని అనుమానించి సామాను క్రిందకు విసిరికొట్టింది. వాటిని ఏరుకొని బయలుదేరాడు చలం.

ఆలోచనలు విచ్చిపోకుండానే యింటిముందు కొచ్చాడు. లక్ష్మి చేతిలో సంచిలాక్కుంది. గోపి తప్పటడుగులతో వచ్చి

కాళ్ళకు పెనవేసుకున్నాడు. చలం ఆలోచనల్లోంచి బాహ్యం లోనికి రాగానే సంచిలోంచి విరిగిన మతాబుల్ని తీసి "ఇవేంటి విరిగిపోయా యేం" అంటున్న లక్ష్మి మాటలు వినిపించాయి.

చలం మాట్లాడకుండా కాళ్ళకు చుట్టుకున్న గోపీని ఎత్తి వళ్ళోకూర్చోబెట్టుకొని "ఈ మతాబులన్నీ నీకోసమే బాబూ" అంటూ గోపీచేత కాల్పిస్తుంటే అర్థంగానివ్యథా బిందువులు రెండు అతని కళ్ళల్లోనుండి జారి నేలమీదపడి ముత్యాల్లా జిగేల్‌మని మెరిసి చీకట్లో కలిసిపోయాయి.